క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో 47వ ర్యాంకు



తెనాలి: జేఈఈ మెయిన్స్–2023 ఫలితాల్లో శ్రీచైతన్య (వ్యాస్ భవన్), తెనాలి విద్యార్థులు వివిధ కేటగిరీల్లో 5వేల లోపు 47, 1089, 3669 ర్యాంకులను సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.తిరుపతిరావు తెలియేశారు. జాతీయ స్థాయిలో 47వ ర్యాంకు సాధించిన పి.విశాల్ సాయిరెడ్డి, 1089 ర్యాంకు పొందిన కె.భార్గవ్, 3669 ర్యాంకరు ఎం.భరత్‌కుమార్‌లను ఆయన అభినందించారు. జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు తమ విద్యార్థులు 54 మంది అర్హత సాధించినట్ల తెలియజేశారు.

18న రౌండ్‌టేబుల్ సమావేశం



తెనాలి: బోయ, వాల్మీకీలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ఉద్దేశించిన జీఓ నెంబర్ 52ను రద్దుచేయాలని కోరుతూ ఎస్టీ రిజర్వేషన్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 18న ఉదయం 10 గంటలకు గుంటూరులోని అరండల్‌పేట ఒకటో లైనులో గల ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ ఆఫీస్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరగనుంది. దీనికి సంబంధించిన కరపత్రాల ఆవిష్కరణ బుధవాకం రూరల్ మండల గ్రామం తెలప్రోలులోని యానాది కాలనీలో నిర్వహించారు. కులనిర్మూలన పోరాట కమిటీ సభ్యుడు జంపాల దుర్గా చేవూరు దుర్గాభవాని, సురేష్, తిరువీధుల కోటిలింగమ్మ, కొమగిరి నాగమణి, అంజమ్మ, మెలికా మాంకాళమ్మ, దుర్గా, వెంకటమ్మ, నాగమళి, కత్తి గోవిందమ్మ, తిరువీధుల దుర్గారావు, ఇళ్ల రేణుక, వనజాక్షి, రాచగిరి వెంకటేశ్వరమ్మ, వేల్పూరు వెంకాయమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు జిల్లా విద్యార్థుల ఎంపిక



మంగళగిరి: తిరుపతిలో ఈనెల 17,18,19 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి జూడో పోటీలకు గుంటూరు జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు ఎంపికైనట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ డి ప్రభాకర్ తెలిపారు. నగరంలోని మార్షల్ ఆర్ట్స్ కోచింగ్ సెంటర్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు 63 కేజీల విభాగంలో బేబీ ప్రియాంక, 52 కేజీల విభాగంలో అనూష, 44 కేజీల విభాగంలో ప్రసన్న, 60 కేజీల విభాగంలో డి జయరామ్, 73 కేజీల విభాగంలో శ్రీరామ్, 66 కేజీల విభాగంలో ఉదయభాను, 80 కేజీల విభాగంలో ఇసాక్ ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి రాంబాబు, కార్యదర్శి పి శ్రీదేవి, అధ్యక్షుడు అరవింద మహర్షి లు అభినందించినట్లు తెలిపారు.

ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం



తాడేపల్లిరూరల్: మంగళగిరిలోని మారుతి మహిళా సొసైటీ కార్యాలయంలో ప్రపంచ రక్తదాత దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎస్ఆర్ జనరల్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించగా హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పదని అన్నారు. రోగ్యవంతమైన మనిషి ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని, రక్తదానంపై అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అన్నారు. అనంతరం అందరూ రక్తదానం చేశారు. కార్యక్రమంలో మారుతి మహిళా సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ గిరిజ, సిబ్బంది, బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీరుకొండలో ఘర్షణ

ఇరువురికి గాయాలు

మంగళగిరి: మండల పరిధిలోని నీరుకొండ గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్న ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బీసీ కాలనీలోని రోడ్లకు గ్రావెల్ తోలే క్రమంలో ట్రాక్టర్ల డ్రైవర్లు ఇద్దరి మధ్య వివాదం చెలరేగింది. తోట వెంకటేశ్వరరావు, తాడిబోయిన సాంబశివరావులు మధ్య జరిగిన వివాదం ఇరు కుటుంబాల మధ్య ఘర్షణకు కారణమైంది. ఘర్షణలో వెంకటేశ్వరరావు, సాంబశివరావులు గాయపడగా ఇరువురిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిధులు వినియోగం.. సమస్యలు పరిష్కారం

- తెనాలి అభివృద్ధికి 14వ ఆర్థిక సంఘం నిధులు తోడ్పాటు
- పట్టణంలో పలు రోడ్లు, కల్వర్టులు, కాల్వల ఏర్పాటు
- రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిధుల వినియోగం

తెనాలిఅర్బన్: 14వ ఆర్థిక సంఘం నిధులు తెనాలి పురపాలక సంఘంలో సద్వినియోగమయ్యాయి. అనుకున్న సమయానికి నిధులను పట్టణాభివృద్ధికి, విద్యుత్ చార్జీల చెల్లింపులకు ఉపయోగించారు. గత ప్రభుత్వంలో ఆర్థిక సంఘ నిధులను సకాలంలో ఉపయోగించుకోలేకపోవడంతో వెనుక్కి వెళ్లాయి. కానీ నేటి ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు వీటిని అధికారులు పూర్తిస్థాయిలో ఉపయోగించున్నారు.

పురపాలక సంఘాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘ పేరిట ప్రతి ఏడాది నిధులు విడుదల చేస్తుంటుంది. పురపాలక సంఘస్థాయిని బట్టి నిధులు విడుదల చేసి వాటిని పట్టణాలలోని అభివృద్ధి పనులకు ఉపయోగించుకోవాలని సూచిస్తుంది. అంతేకాకుండా వాటికి 5 సంవత్సరాల కాల పరిమితిని విధించి, ఆ లోపు పనులు పూర్తి చేయకపోతే నిధులు వెనక్కి తీసుకుంటుంది.

తెనాలి పురపాలక సంఘానికి వచ్చిన రూ.36.66కోట్లు..

2015 ఏప్రిల్ ఒకటిన 14వ ఆర్థిక సంఘం ప్రారంభమైంది. దానికింద తెనాలి పురపాలక సంఘానికి అయిదేళ్లలో రూ.36.66కోట్ల నిధులను విడుదల చేశారు. 2015–16 సంవత్సరంలో రూ.3.81కోట్లు, 2016 –17లో 7.09కోట్లు, 2017–18లో రూ.8.27కోట్లు, 2018–19లో రూ.6.63 కోట్లు, 2019–20లో రూ.10.64 కోట్లను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. అయితే నిధులు ప్రతి ఏడాది సకాంలో విడుదల కాలేదు. ఉదాహరణకు 2016 ఏప్రిల్‌లో విడుదల కావాల్సిన నిధులు 2017 సంవత్సరంలో విడుదల అయ్యాయి. ఇలా నిధుల విడుదలలో జాప్యం జరగటం వల్ల ఉన్నతాధికారులు వాటి వినియోగానికి అదనపు సమయాన్ని ఇస్తూ జీఓలు ఇచ్చారు. వాస్తవంగా వీటి పనులు 2020 ఏప్రిల్‌లో పూర్తి కావాల్సి ఉంది. కానీ నిధుల విడుదలలో జాప్యం వల్ల 2023 మార్చి చివరి నాటికి వీటి పనులు పూర్తి చేశారు.



26వ వార్డు అప్పలస్వామి గుడి రోడ్డులో నిర్మించిన రహదారి

పట్టణాభివృద్ధికి దోహదం..

14వ ఆర్థిక సంఘ నిధులు తెనాలి పట్టణాభివృద్ధికి దోహదపడ్డాయి. కేంద్రం విడతల వారీగా తెనాలి అభివృద్ధికి రూ.36.66 కోట్లను విడుదల చేసింది. వాటిలో ఎక్కువ భాగం రోడ్లు, మురుగు కాల్వలు, కల్వర్టుల నిర్మాణాలు, శ్మశానాల అభివృద్ధికి ఉపయోగించారు. అయితే గతేడాది రూ.36 కోట్లలో సుమారు రూ.9 కోట్ల నిధులను ఆలస్యంగా విడుదల చేసింది. వీటిలో ముందుగా రూ.2 కోట్లు వచ్చాయి. అయితే వాటి వినియోగానికి సంబంధించిన నిబంధనలు కూడా ఆలస్యంగా రావటం, సమయం తక్కువగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం వాటిని విద్యుత్ చార్జీల చెల్లింపులకు ఉపయోగించుకోవాలని సూచించింది. దీంతో తెనాలి మున్సిపాలిటీకి పెండింగ్ ఉన్న సుమారు రూ.2కోట్ల నిధులను వాటికి ఉపయోగించారు. మిగిలిన రూ.7 కోట్లను పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు ఉపయోగించారు. మొత్తం మీద 14వ ఆర్థిక సంఘం నిధులు తెనాలి పట్టణ అభివృద్ధికి తోడ్పాటును అందించాయనటంలో ఎటువంటి సందేహం లేదు.



22వ వార్డులో నిర్మించిన మురుగు కాల్వ

పేదింటి విద్యకు జగనన్న కానుక



ఎన్‌సీఆర్ స్కూల్‌లో విద్యార్థులకు విద్యా కానుక కిట్‌లను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్

- చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్
- విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ

తెనాలిఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించటమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ పేర్కొన్నారు. మారీసుపేటలోని ఎన్‌సీఆర్‌ఎన్‌ఎం హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నాడు–నేడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్యాబోధన చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ అహ్మద్, ఉపాధ్యాయులు పీవీ సుధారాణి, పులి భాస్కర్, స్వామి పాల్గొన్నారు.

కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిరా మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్‌లను మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ పంపిణీ చేశారు. అలాగే 15వ వార్డులోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లోని విద్యార్థులకు విద్యా కానుక కిట్‌లను మాజీ వైస్ చైర్మన్, కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు పంపిణీ చేశారు. అలాగే ఇందిరానగర్‌లోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి విద్యా కానుక కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమాలలో ప్రధానోపాధ్యాయులు వెలగ శాంతకుమారి, టి సత్యనారాయణ, సౌజన్య,ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మట్లపూడి రాజేశ్వరరావు, కె.బాబురావు, మేడేపల్లి ప్రభాకర్, సురుపుల వెంకట్రావు, బి.శివకృష్ణ, రావూరి కృష్ణ, వాసిరెడ్డి కళ్యాణి, షేక్ కౌసర్ జహ పాల్గొన్నారు.



బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు కిట్‌లు పంపిణీ చేస్తున్న వైస్ చైర్మన్ హరిప్రసాద్



15వ వార్డులోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో కిట్ పంపిణీ చేస్తున్న మాజీ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు

‘నీట్’లో ఎన్నార్ై విద్యార్థుల ప్రతిభ

తెనాలి: వైద్యవిద్యలో ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నిర్వహించిన ‘నీట్’ పరీక్షల్లో స్థానిక ఎన్నారై కాలేజీ విద్యార్థులు మంచి ఫలితాలను సాధించినట్లు కాలేజీ సీఈఓ సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలియజేశారు. మొత్తం 720 మార్కులకు గాను తమ విద్యార్థులు జి.సహ గ్రేస్ 570 మార్కులు, ఎస్.రాకేష్ 540 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఏపీ ఈఏపీ ఫలితాల్లో ఇంజినీరింగ్ విభాగంలో 911వ ర్యాంకు, 1425, 1880, 2162, 2531, 2612, 2714, 1824 ర్యాంకులతోపాటు 5 వేల 15 మంది, 10 వేల లోపు 32 మంది, 20వేల లోపు 62 మంది ర్యాంకులు సాధించినట్టు వివరించారు. మెడికల్ విభాగంలో 687, 799, 1618, 1723, 1921, 2023 ర్యాంకులతో పాటు 5వేల లోపు 13 మంది, 10 వేల లోపు 21 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్టు వివరించారు. ర్యాంకులను సాధించిన విద్యార్థుల అభినందన సభలో ఆయనతోపాటు ప్రిన్సిపాల్స్ కె.కృష్ణారెడ్డి, ఎస్.శివన్నారాయణ, మల్లేశ్వరి, పి.కిషోర్, కె.సురేష్ పాల్గొన్నారు.



నీట్, ఏపీ ఈఏపీ సెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థుల అభినందన

దాడి ఘటనపై కేసు

తెనాలిరూరల్: దాడి ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక రజకచెరువు ప్రాంతానికి చెందిన తన భర్త రామాంజనేయులుపై అదే ప్రాంతానికి చెందిన డాక్టర్ ఖాన్ దాడి చేశాడంటూ పద్మావతి అనే మహిళ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు బుధవారం తెలిపారు.

కైలాసగిరి కార్యవర్గం ఎన్నిక

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల కైలాసగిరి పాలక మండలి నూతన కమిటీ సమావేశం బుధవారం జరిగింది. నూతన కమిటీ చైర్మన్‌గా మేడికొండూరు జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా ముక్కు ప్రభాకర్ రెడ్డి, సెక్రెటరీ ఉడతా ప్రభాకరరావు, జాయింట్ సెక్రెటరీ ఐలా రఘు, ట్రెజరర్ వెంకట సుబ్బారెడ్డి, సభ్యులుగా గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యనిర్వాహక సభ్యులు ఆవుల సంజీవరెడ్డి, జంపని శ్రీకాంత్, అందుగల ప్రవీణ్ ఎన్నికయ్యారు. సిద్ధయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కై లాసగిరి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

రేపు అన్నాభిషేకానికి అంకురార్పణ

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 16వ తేదీన శ్రీనగరేశ్వరస్వామికి జరిగే మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, సహస్ర లింగార్చన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తిచేశారు. అన్నాభిషేకానికి ముందుగా సూచించినట్టు మంత్రజపం చేసిన బియ్యాన్ని స్వీకరించే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో మహాశివలింగం వద్ద అక్షయపాత్రను ఏర్పాటుచేశారు. ముందుగా పరమేశ్వరుడికి విశేష పూజాకార్యక్రమాలను ప్రారంభించారు. దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో లోకకళ్యాణార్థం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భక్తులు పాల్గొని పరమశివుని కృపకు పాత్రులు కావాలని కోరారు. అన్నాభిషేకం అనంతరం భక్తులకు మహా అన్న సంతర్పణ ఉంటుందన్నారు. వుప్పల వరదరాజులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, 35వ వార్డు కౌన్సిలరు గొడవర్తి సాయిహరేరామ్, మద్దాళి శేషాచలం, నూకల వెంకట భాస్కర్, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భక్తులు సమర్పించిన బియ్యంను స్వీకరించిన కమిటీ సభ్యులు

జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ



మంగళగిరి: నగర పరిధి యర్రబాలెం ఎంపీయూపీ పాఠశాల, శ్రీనగర్ కాలనీ పాఠశాల విద్యార్థులకు బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా విద్యార్థులకు నాలుగవ విడత జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండాల శ్రీనివాసరావు, కాపరౌతు భాస్కరరావు, తాడేకోరు రమేష్, దానబోయిన నాగయ్య, షేక్ షఫీ, ఎస్‌కే గౌస్, రేమిణిశెట్టి నాగరాజు శరత్, సాలి బంగారయ్య, నల్లిబోయిన శ్రీనివాసరావు, నాయుడు హనుమంతరావు, గోపి, ఇందిర, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం సమాజసేవలో భాగం

- యువత ఏడాదికోసారైనా రక్తదానం చేయాలి
- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: రక్తదానం చేయటం సమాజ సేవలో భాగమని, యువత ఏడాదికి ఓ సారైనా రక్తదానం చేయటం తప్పనిసరి చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. ఆపత్కాలంలో ఉన్నవారికి రక్తదానంతో ప్రాణాపాయం నుంచి రక్షించినట్టు కాగలదన్నారు. రక్తదానం చేసినందున ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదన్నారు. స్థానిక ఏఎస్ఎన్ విద్యాసంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ డిపార్టుమెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ (స్టెప్) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రకాశం రోడ్డులోని ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి సహకారంతో ఏర్పాటైన శిబిరాన్ని కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ ప్రారంభించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ఏఎస్ఎన్ విద్యాసంస్థలు గత 25 ఏళ్లుగా ఏటా రక్తదాన శిబిరం నిర్వహిస్తూ ప్రతిసారీ 100 యూనిట్ల రక్తదానం చేస్తున్నట్టు గుర్తుచేశారు. విద్యార్థుల్లో సమాజసేవా దృక్పథాన్ని పెంచటం బాధ్యతగా భావిస్తున్నట్టు తెలిపారు. ‘స్టెప్’ సీఈఓ డాక్టర్ కె.శిరీష మాట్లాడుతూ యూత్ సర్వీసెస్ ఆధ్వర్యంలో యువతను రకరకాల కార్యక్రమాల్లో ప్రోత్సహిస్తున్నామని తెలియజేశారు. తమ కాలేజీ విద్యార్థులు 124 యూనిట్ల రక్తదానం చేసినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ వెల్లడించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎస్‌వీ శర్మ, స్టెప్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులకు ఎమ్మెల్యే శివకుమార్ జ్ఞాపికలను అందజేశారు.



రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే శివకుమార్

స్కూల్ బస్సుల నిర్వహణలో అశ్రద్ధ వద్దు

- నిబంధనలు పాటించపోతే చర్యలు
- మంగళగిరి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌శరద్

తాడేపల్లిరూరల్: స్కూల్ బస్సుల నిర్వహణలో అశ్రద్ధ వహించి నిబంధనలు పాటించకపోతే కఠినచర్యలు తీసుకుంటామని మంగళగిరి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విజయ్ శరద్ అన్నారు. బుధవారం ఉండవల్లి అమరావతి రోడ్డులో స్కూల్ బస్సును తనిఖీ చేశారు. తనిఖీలో విజయవాడకు చెందిన ఎస్ఆర్ జూనియర్ కళాశాల బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ లేకపోవడం, ఫైర్ సిలెండర్లు కాలం చెల్లినవి కావడం, డ్రైవర్ కూడా 60 సంవత్సరాలు పైబడి ఉండడంతో సదరు బస్సుపై కేసు నమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యాలు విద్యార్థులను బస్సులో తీసుకు వెళ్లేటప్పుడు జా గ్రత్త వహించాలని, డ్రైవర్ వయస్సు 60 సంవత్స రాలు మించకూడదని, బస్సులో ఫిట్‌నెస్ సర్టిఫి కేట్‌తో పాటు ఇతర పత్రాలు అన్నీ ఫోర్స్‌లో ఉండాలని, స్కూల్ బస్‌కు తప్పనిసరిగా ఎమర్జెన్సీ డోర్‌తో పాటు ఫస్ట్ ఎయిడ్‌కిట్, ఫైర్ సేఫ్టీ సిలెండర్లను ఉంచాలని తెలిపారు. పరిమితికి మించి విద్యార్థులను బస్సులో ఎక్కిస్తే సదరు స్కూల్ బస్సు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెదకొండూరులో అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సాయం ప్రకటించారు. పెదకొండూరు ఎస్సీ కాలనీకి చెందిన సుద్దపల్లి మౌనిక రూ.10 వేలు, కొండూరు అనిల్‌కు రూ.10 వేలు, కుక్కమళ్ల మాణిక్యం రూ.15వేలు, యడ్లూరి మరియమ్మకు రూ.10 వేలు దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జిల్లా బీసీసెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కొండూరు సుమన్, వైఎస్సార్‌సీపీ నాయకులు బర్మా అర్జున్, కొండూరు కిరణ్, చంటి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో ఆగని దొంగతనాలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లోని శ్మశానవాటికలను కూడా వదలకుండా దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ దొంగతనం మెల్లెంపూడి హిందూ శ్మశానవాటికలో చోటుచేసుకుంది. మెల్లెంపూడి శ్మశానవాటికలో దాతల సహాయంతో అభివృద్ధి కమిటీ వారు శ్మశానవాటికను అందంగా తీర్చిదిద్దారు. మృతదేహాలను దహనం చేసేందుకు బీడు ప్లేట్లతో నిర్మాణం చేశారు. ఆ బీడు ప్లేట్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. ఇదిలా ఉండగా ఇప్పటంలో ఉన్న శ్మశానవాటిలో కూడా బీడు ప్లేట్లను దొంగిలించేందుకు ప్రయత్నించారు. పూర్తి స్థాయిలో బోల్టులు రాకపోవడంతో వాటిని అక్కడే వదిలివేశారు. పెనుమాకలో కూడా ఇదే విధంగా దొంగతనం జరిగి వారం రోజులు గడవక ముందే మెల్లెంపూడిలో జరడగం, ఇప్పటంలో విఫలయత్నం చేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పోలీసుల నిఘా లోపం వల్లే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.



మెల్లెంపూడి హిందూ శ్మశానవాటికలో బీడు ప్లేట్లను అపహరించిన దృశ్యం

దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పట్టణ సీఐ బి.అంకమ్మరావు

మంగళగిరి: దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకుని ఆపత్కాలంలో పోలీస్ వారి సేవలను వినియోగించుకోవాలని మంగళగిరి పట్టణ సీఐ బి అంకమ్మరావు పేర్కొన్నారు. నగరంలోని అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో బుధవారం దిశ యాప్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. యువతీ, యువకులు, మహిళలకు దిశ యాప్ ఫోన్‌లో డౌన్ లోడ్ చేయించి అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ దిశ యాప్‌లో ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పులతో మరింత కఠినతరంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజల రక్షణ కోసం తీసుకువచ్చిన దిశయాప్‌ను ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకోవాలని కోరారు. దిశ యాప్‌తో ఎంతో మంది రక్షణ పొందుతున్నారని, దిశయాప్ దేశానికికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ముఖ్యంగా టీనేజి యువతీ,యువకులతో పాటు ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను తప్పనిసరిగా తమ ఫోన్లలో డౌన్‌లౌడ్ చేసుకునేలా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

‘యానాదులు ఆర్థికంగా ఎదుగుతున్నారు’

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్లే రాష్ట్రంలో యానాదులు ఆర్థికంగా ఎదుగుతున్నారని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యందేటి వెంకటసుబ్బయ్య అన్నారు. బుధవారం దుగ్గిరాల మండల పరిధిలోని యానాదుల కాలనీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ వేదికగా త్వరలో యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యానాది గర్జన నిర్వహిస్తామని, యానాదులందూ తరలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం దుగ్గిరాల ఎస్టి యానాదుల కాలనీలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధితి బాపట్ల బ్రహ్మయ్య, ఉపాధ్యక్షులు రావూరి రాజు, గుంటూరు జిల్లా అధ్యక్షులు కొమరగిరి సూరిబాబు, ప్రధాన కార్యదర్శి మేకల ఎనివాసరావు, గుంటూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు జున్ను కళ్యాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమరగిరి చెంచయ్య పాల్గొన్నారు.

పురాతత్వ సంపదను ముందు తరాలకు అందించాలి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ మొవ్వ శ్రీనివాస్ రెడ్డి

తాడేపల్లిరూరల్: పురాతత్వ సంపదను ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని లయోల కాలేజీ ప్రొఫెసర్ మొవ్వ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంటిఎంసి పరిధిలోని ఉండవల్లి గుహల వద్ద అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా లయోల కాలేజీ ప్రొఫెసర్ మొవ్వ శ్రీనివాస్‌రెడ్డి విచ్చేశారు. ముందుగా ఉండవల్లి అమరావతి రోడ్‌లో ఉండవల్లి గుహల వద్ద ర్యాలీని నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆజాదికా అమృత మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించామని తెలిపారు. మన ముందు తరాల వారు మనకు ఇచ్చిన పురాతత్వ సంపదను మనం భావితరాలకు అందజేయాలని అన్నారు. పురాతత్వ సంపదను మనం పరిరక్షిస్తేనే ముందు తరాలకు అందివ్వగలరని వివరించారు. కార్యక్రమంలో డీవైఎస్ ఏఈ వీరాంజనేయులు, డాక్టర్ డీఎస్ బోయ్, నాగేంద్ర కుమార్, ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొలకలూరి ఇనాక్‌కు వెండి కిరీటం బహూకరణ

గుంటూరు రూరల్: విద్య ద్వారా ఉన్నత శిఖరాల్ని చేరవచ్చని పద్మశ్రీ అవార్డు గ్రహీత, డాక్టర్ వైఎస్సార్ జీవన సాఫల్య అవార్డు గ్రహీత డాక్టర్ కొలకలూరి ఇనాక్‌ను చూస్తే తెలుస్తుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ తెలిపారు. మండలంలోని వెంగళాయపాలెంలో బుధవారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొలకలూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో డాక్టర్ కొలకలూరి ఇనాక్‌కు జీవనసాఫల్య పురస్కారం, వెండి కిరీటం బహూకరణతో పాటు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవరప్రసాద్ ఇనాక్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నారని తెలిపారు. అవార్డు గ్రహీత డాక్టర్ కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ ప్రేమ ఆప్యాయతలు చూపి, అవార్డును అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఐజీ బాలస్వామి, డాక్టర్ కె. భగవాన్‌దాస్, అత్తోట జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.